
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ¦ 23 ¦ డిసెంబర్ ¦ 2023



దారిపొడవునా ధాన్యమే..

జీటీ రహదారులపై కొందరు మొక్కజొన్నలు, ధాన్యం ఆరబోస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

8లో



భయం వద్దు.. జాగ్రత్తలు చాలు

జాగ్రత్తలు పాటిస్తే కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తితో భయపడాల్సిన పనిలేదని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

8లో

గరిష్టం / కనిష్టం
29° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతాయి.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం ప్రీ (ముందస్తు) లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. శుక్రవారం కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

260 మంది డాక్ సేవక్‌ల తొలగింపు

నిరవధిక సమ్మెలో పాల్గొనడంతో వేటు

ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి/సత్తుపల్లి టౌన్ : సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగిన గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)లపై కేంద్ర ప్రభుత్వం వేటు వేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా(ఖమ్మం డివిజన్)లో 1,500 మందికి పైగా డాక్ సేవక్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా 550 మంది పాల్గొన్నారు. అయితే, నిబంధనలు ఉల్లంఘించి సమ్మెలో పాల్గొన్న వారిని తొలగిస్తామని 14వ తేదీన నోటీసులు జారీ చేయడంతో 290 మంది వరకు విధుల్లో చేరారు. మిగతా 260 మంది మాత్రం 15వ తేదీన కూడా సమ్మె కొనసాగించారు. మూడేళ్ల లోపు సర్వీస్ ఉన్న గ్రామీణ డాక్ సేవక్‌లు ఆందోళనలు, సమ్మెలో పాల్గొనకూడదని నిబంధన ఉన్నా ఉల్లంఘించారంటూ విధుల నుంచి తొలగించారు. విధుల నుంచి తొలగిస్తూ ఈ నెల 15వ తేదీనే ఉత్తర్వులు వెలువడినా, శుక్రవారం బయటపడింది. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు శనివారం నుంచి జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల వారీగా జట్లు పాల్గొంటాయి. శనివారం ఉదయం 10.30 గంటలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించనుండగా, 26వ తేదీ వరకు కొనసాగుతాయి.

కనులారా వీక్షించి..



భద్రాచలం వద్ద పవిత్ర గోదావరిలో హంసవాహనంపై విహరిస్తున్న శ్రీసీతారామ చంద్రస్వామివారు



పూజలు అందుకుంటున్న రామయ్య స్వామి

ఆనందపరవశులైన భక్తజనులు

- కమనీయంగా శ్రీ సీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవం
- మిరిమిట్లు గొలిపే కాంతులతో మనోహరంగా గోదావరి తీరం
- భక్తుల రద్దీతో సందడిగా మారిన భద్రగిరి క్షేత్రం

భద్రాచలం: పండితుల వేదమంత్రోచ్చరణలు, భక్తజనుల జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి లాహిరి లాహిరి.. లాహిరి అనుకుంటూ గోదావరిలో జలవిహారం చేశారు. విద్యుత్ దీపకాంతులు, బాణసంచా వెలుగుల నడుమ శ్రీసీతారామచంద్రస్వామి విహరిస్తుండగా, వీక్షించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. తెప్పోత్సవ దృశ్యాలను మది నిండా దాచుకుని తిరిగి ఉత్తర ద్వార దర్శనంలో మరోసారి రాముడి దర్శనం కోసం భద్రాద్రిలో ఎదురు చూస్తున్నారు.

ఊరేగింపుగా నదీ తీరానికి..

పగల్‌పత్తు ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, సేవాకాలం, శ్రీ తిరుమంగై అళ్వార్లకు పరమపదోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్‌పత్తు ఉత్సవాలకు ముగింపు పలికారు. గర్భగుడిలో ప్రభుత్వోత్సవం (దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక పల్లకీపై సీతారాములు గోదావరి తీరానికి బయల్దేరారు. భక్తుల కోలాటాలు, వివిధ వేషధారణల నడుమ స్వామివారిని తీసుకొచ్చారు. అర్చకులు తొలుత పుణ్య జలాలతో హంసవాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారిని హంసవాహనంలో ప్రత్యేక అలంకరణ మండపంలో తూర్పు ముఖంగా కొలువుదీర్చారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయర దివ్యప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్ర పాఠాలు పఠించారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనతో సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి వీఐపీలను దర్శనానికి అనుమతి ఇచ్చారు.

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాధికాలు పూర్తయిన తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. నిశ్చలంగా ఉన్న గోదావరి నదిలో విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం మొదలైంది. నదిలో హంస వాహన ప్రతిబింబం, ఆకాశంలో బాణసంచాలు వెలువరిస్తున్న రంగురంగుల మెరుపుల మధ్య గోదావరి తీరం ప్రత్యేక శోభను సంతరించుకోగా, రామయ్య జలవిహారం కనుల పండువగా సాగింది. ఒక్కో పరిక్రమాణానికి సగటున 12 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఐదు పరిక్రమణాలు పూర్తయ్యే సరికి రాత్రి 7.01 గంటలయింది. తెప్పోత్సవం ముగిసిన అనంతరం ఆగమ శాస్త్ర పద్ధతులు అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు.



తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్, ఏఎస్పీ తదితరులు

ఆకట్టుకున్న కోలాటం

ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకీపై ఊరేగింపుగా గోదావరి తీరానికి బయలు దేరారు. తెప్పోత్సవానికి పల్లకీలో స్వామివారు వెళ్లే సమయంలో పల్లకీ ముందు వివిధ సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపల్లి మహిళల డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టీబీజీకేఎస్‌లో కుదుపులు



ఐఎన్‌టీయూసీలో చేరేందుకు కొత్తగూడెం నుంచి హైదరాబాద్ బయల్దేరుతున్న టీబీజీకేఎస్ నాయకులు

- ఇప్పటికే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల రాజీనామా
- అదే బాటలో కొత్తగూడెం రీజియన్ నేతలు
- కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీలో చేరిక
- పావులు కదిపిన జిల్లా మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో తిరుగులేని యూనియన్‌గా గడిచిన పదేళ్ల నుంచి ఆధిపత్యం వహిస్తున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లో కుదుపులు మొదలయ్యాయి. కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ అనుసరిస్తున్న వ్యూహాలను వ్యతిరేకిస్తూ కార్మిక నేతలు రాజీనామా బాటపట్టారు. ఈ మేరకు టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేరుతో మీడియాకు విడుదల చేశారు. అగ్రనేతల బాటలోనే ఆరు జిల్లాల పరిధిలో ఉన్న కిందిస్థాయి నేతలు సైతం మూకుమ్మడి రాజీనామా చేశారు. ఇందులో భాగంగానే కొత్తగూడెం రీజియన్ నేతలు ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఐఎన్‌టీయూసీలో చేరారు.

కాంగ్రెస్ వైపు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీలోకి భారీగా వలసలు ఉంటాయనే అభిప్రాయం నెలకొంది. అయితే అంచనాలకు మించి ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నిన్నామొన్నటి వరకు వెలుగు వెలిగిన టీబీజీకేఎస్ నేతలు ఇప్పుడు పక్కచూపులు చూస్తున్నారు. మారుతున్న పరిస్థితుల కారణంగా నిన్నామొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన మంత్రి పొంగులేటి శ్రీనివసరెడ్డి మరోసారి సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో యాక్టివ్ కానున్నారు. గత గుర్తింపు ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపు కోసం ఆయన పనిచేశారు. దీంతో గులాబీ కార్మిక సంఘం నేతలతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ప్రస్తుతం టీబీజీకేఎస్‌లో నెలకొన్న సంక్షోభం, మరో వారంరోజుల్లో రానున్న గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో పొంగులేటి పాత్ర కీలకం కానుంది.

ఇరవై ఏళ్ల ప్రస్థానం

మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన తర్వాత సింగరేణి కోసం ప్రత్యేకంగా టీబీజీకేఎస్‌ను బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసింది. 2003 జనవరి 29న టీబీజీకేఎస్ ఊపిరి పోసుకుంది. అప్పటి నుంచి సింగరేణి సమస్యలపై పోరాడుతూ వస్తోంది. అయితే 2009 డిసెంబరు 9 ప్రకటన తర్వాత టీబీజీకేఎస్ అనూహ్యంగా పుంజుకుంది. ఆ తర్వాత 2012, 2017 గుర్తింపు సంఘం ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. 2019లో ఓసారి సంక్షోభం తలెత్తినా ఆ వెంటనే సమసిపోయింది. కానీ ఈసారి పరిస్థితులు గతానికి భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతోపాటు ఒకేసారి అగ్రనాయకత్వం రాజీనామా బాటపట్టింది. మరోవైపు సింగరేణిలో గెలుపు కోసం కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. ఈ కారణాలతో ప్రస్తుత పరిస్థితుల్లో టీబీజీకేఎస్‌కు తీవ్ర నష్టం తప్పదనే చెబుతున్నారు.

బెడిసికొట్టిన వ్యూహం

సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల విషయంలో బీఆర్ఎస్ అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీకి అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్‌కు చిక్కులు తెచ్చి పెట్టాయి. గడిచిన రెండేళ్లుగా వివిధ కారణాలు సాకుగా చూపుతూ కార్మిక సంఘం ఎన్నికలను బీఆర్ఎస్ వాయిదా వేస్తూ వస్తోంది. చివరకు కోర్టు జోక్యంతో ఈనెల 27న ఎన్నికలు జరగబోతున్నాయి. మరోవైపు ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. దీనికి తోడు సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన నియోజకవర్గాల్లో కారు గుర్తుపై పోటీ చేసిన వారు కాంగ్రెస్ అభ్యర్థుల చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. దీంతో కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ వెనక్కి తగ్గాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. ఇదే సమాచారాన్ని కార్మిక సంఘం నేతలకు అందించారు. కానీ ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన నేపథ్యాన వెనక్కి తగ్గితే ఉనికికే ప్రమాదమనే భావనకు టీబీజీకేఎస్ నేతలు వచ్చారు. దీంతోనే మూకుమ్మడిగా రాజీనామా చేశారు.

రెండో వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలం వద్ద రెండో వంతెన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి ఆమె జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బ్రిడ్జి నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వంతెన నిర్మాణ పనులను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. నిర్మాణ పనులలో వేగం పెంచేందుకు అవసరమైన కార్మికులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రత్యామ్నాయంగా రెండువైపులా అప్రోచ్ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని చెప్పారు. పనులు సకాలంలో పూర్తి చేయడానికి షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, డీఈ శైలజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

నేటి నుంచి రాపత్తు సేవలు

భద్రాచలం: వైకుంఠ ఏకాదశి ముగిసిన తర్వాత శ్రీ సీతారామచంద్రస్వామి వారికి రాపత్తు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శనివారం నుంచి జనవరి 2 వరకు స్వామివారికి రాపత్తు సేవలు నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఈ సేవలు నిర్వహిస్తారు. శనివారం శ్రీరామరక్షామండపం(డీఎస్పీ కార్యాలయ ప్రాంగణం) వద్ద రాపత్తు విలాసోత్సవం జరగనుంది.

ముక్కోటి దేవతలు పూజించే క్షణం

- నేడు సీతారాముల ఉత్తర ద్వార దర్శనం
- దర్శించుకుంటే అంతులేని పుణ్యఫలమని భక్తుల విశ్వాసం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వైకుంఠంలో వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని ప్రతీతి. ఈ రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం వస్తుందని వేద పండితుల ఉవాచ. అంతేకాదు సర్వపాపాలు తొలగిపోయి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అందువల్లే ఏకాదశి రోజున ఉత్తర ద్వారంలో భద్రాద్రి శ్రీరాముడిని దర్శించుకునేందుకు భక్తులు ఇష్టపడతారు.

బ్రహ్మముహూర్తంలో..

దేవేరులు నేరుగా భక్తులకు దర్శనం ఇవ్వడానికి ముందు బ్రహ్మ ముహూర్తంలో తెల్లవారుజామున మూడు గంటల నుంచే పూజాధికాలు మొదలవుతాయి. సంప్రదాయాన్ని అనుసరిస్తూ సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. ఉత్తర ద్వారదర్శన ప్రాశస్త్యాన్ని వేదపండితులు భక్తులకు వివరిస్తారు. దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలను పాడుతారు. అనంతరం రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతను తెలియజేస్తారు.



ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారు(ఫైల్)

భక్తి భావన..

ఉదయం ఐదు గంటల సమయంలో ఉత్తర ద్వారాలు తెరచుకోగానే ముందుగా దట్టంగా కమ్ముకున్న ధూపం భక్తులకు కనిపిస్తుంది. ధూపాన్ని చీల్చుకుంటూ దీపాల కిరణాలు కనిపిస్తాయి. ఈ రెండింటి నడుమ గరుడవాహనంపై ఆశీనుడైన సీతారామ చంద్రస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అపూర ఘట్టం ఆవిష్కృతమవగానే భక్తులు ఒక్కసారిగా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తారు. అదే సమయంలో మేళతాళాలు మోగుతుంటాయి. పండితులు మంగళహారతులు ఇస్తుంటారు. ఆ క్షణం నుంచి కొన్ని నిమిషాల పాటు భద్రగిరుల్లో అలౌకికమైన భక్తి భావం భక్తులను అలుముకుంటుంది.

ధూపదీపాల నడుమ..

గంటసేపు ఉత్తర ద్వారంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నివేదన, ఫల నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించి, వేదపారాయణం నిర్వహించారు. రుగ్వేద, యజుర్వేద, సామ, అధర్వణ వేదాలను వేదపండింతులు పఠిస్తారు. అనంతరం 108 ఒత్తులతో కూడిన హారతిని స్వామివారికి ఇచ్చాక, ద్వార దర్శనం ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరిస్తారు.

గరుడ వాహనంపై..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగే ముక్కోటి ఏకాదశి రోజున శ్రీరాముడు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ సందర్భంగా జగదభి రాముడు గరుడవాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ఆశీనులై ఉంటారు.

తిరువీధి సేవలు..

ఉత్తర ద్వార దర్శనం అనంతరం తిరువీధి సేవకు తీసుకెళ్తారు. ఆలయం నుంచి రాజవీధి మీదుగా తాతగుడి వరకూ వెళ్తారు. తొలుత ఆండాళ్, ఆళ్వార్ దేవతలు ఊరేగుతారు. వందలాది మంది భక్తులు స్వామివారి వెంట నడుస్తుండగా గోవిందరాజ స్వామివారి ఆలయం వరకు తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం తిరిగి రాజవీధి మీదుగా గ్రామ పదర్శన చేసి ఆలయానికి సీతారాములను తీసుకొస్తారు.

మన.. ఘన సింగరేణి!



తొలినాళ్లలో ఇలా తట్టా, చెమ్మస్‌తో బొగ్గు ఉత్పత్తి..

- గోదావరి తీరంలో విస్తరించిన సంస్థకు 134 ఏళ్ల చరిత్ర
- నేడు 135వ ఆవిర్భావ దినోత్సవం
- కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వేడుకలకు ఏర్పాట్లు

సింగరేణి(కొత్తగూడెం): దక్షిణ భారతదేశానికి తలమానికమై, తెలంగాణకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్న సింగరేణి సంస్థ 134 ఏళ్లు పూర్తిచేసుకుని శనివారం 135వ సంవత్సరంలో అడుగుపెడుతోంది. సంస్థలో ఉత్పత్తి అయిన బొగ్గు తెలంగాణతో పాటు మరో ఏడు రాష్ట్రాల్లో విద్యుత్, సిమెంట్, పేపర్ పరిశ్రమలకు సరఫరా చేస్తుండగా... లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది. 1871లో ఇల్లెందు సమీపంలోని సింగరేణి గ్రామంలో బొగ్గు ఉన్నట్లు గుర్తించగా... సర్వే అనంతరం ఆనాటి బ్రిటీష్ శాస్త్రవేత్త విలియం కింగ్ 1889లో గనులు ప్రారంభించారు. తొలినాళ్లలో హెదరాబాద్ దక్కన్ కంపెనీగా పేరుండగా.. 1920 డిసెంబర్ 23 నుంచి సింగరేణి కాలరీస్ కంపెనీగా పిలుస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదుల పరీవాహక ప్రాంతం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపెల్లి, మంచిర్యాల, కొమురంభీం, ఆసిఫాబాద్ జిల్లాల్లో గనులు విస్తరించగా సింగరేణి దినదినాభివృద్ధి చెందుతోంది. మొదట బొగ్గు ఉత్పత్తి, రవాణా మాత్రమే చేయగా ఆ తర్వాత థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పుడు సోలార్ విద్యుత్ ప్లాంట్లనూ ఏర్పాటుచేసి రోజుకు 10 లక్షల యూనిట్లను గ్రిడ్‌కు అప్పగిస్తూ సాలీనా సుమారు రూ.130 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తుండడం విశేషం.

గుర్తించిన బొగ్గు నిల్వలు 11,395 మి.టన్నులు

గోదావరి, ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతలో 11,395 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. నేటి వరకు సుమారు 1,660.34 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీశారు. ఈ ఏడాది సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యం 75 మిలియన్ టన్నుల లక్ష్యానికి 44.79 మిలియన్ టన్నుల ఉత్పత్తి పూర్తయింది.

ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీ

1889లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిన సింగరేణి సుమారు 59 సంవత్సరాలు తట్టా, చెమ్మస్ ఉపయోగించింది. ఆతర్వాత 1948లో షటిల్ కార్, 1950లో క్యాప్ ల్యాంప్‌లు, 1951లో ఎలక్ట్రికల్ కోల్ డ్రిల్స్ వినియోగం మొదలుపెట్టారు. అలా ఏటేటా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వచ్చారు. ఇక 2007లో భూగర్భగనుల్లో వెలువడే గ్యాస్‌ను గుర్తించేలా 3డీ స్కానర్‌ను ఉపయోగించారు.



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు

80శాతం థర్మల్ విద్యుత్‌కే..

సింగరేణి సంస్థలో అధికారులు 2,400 మందితో పాటు సుమారు 39 వేల మంది పర్మనెంట్, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. ఈమేరకు గనుల్లో ఉత్పత్తి చేసే బొగ్గులో 80 శాతం విద్యుత్ పరిశ్రమలకు, 20 శాతం సిమెంట్, స్పాంజ్ ఐరన్, హెవీ వాటర్ ప్లాంట్, సిరామిక్స్, ఫార్మా, ఆగ్రో, పేపర్ ఇతర పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. గతేడాది(2021–22)లో 655.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా, 536.51 లక్షల టన్నులు పవర్ ప్లాంట్లకు పంపిణీ చేశారు.

అనేక విభాగాల సమ్మిళితం

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 24 భూగర్భగనులు, 20 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయి. వీటిలో అత్యాధునిక యంత్రాల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం 80శాతం ఓసీల ద్వారా, 20శాతం భూగర్భ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. కాగా, గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరగాలంటే సుమారు 25 విభాగాలు పనిచేయాల్సి ఉంటుంది.

కీలకంగా కార్పొరేట్ కార్యాలయం

సింగరేణి సంస్థకు కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం గుండెకాయలా పని చేస్తోంది. ఈ కార్యాలయం తొలుత 16 విభాగాలతో ఏర్పాటు కాగా.. ప్రస్తుతం 54 విభాగాలతో కొనసాగుతోంది. డైరెక్టర్లు కూడా ఇక్కడి నుంచి విధులు నిర్వర్తిస్తుండగా సుమారు 54 విభాగాలను జీఎంలు పర్యవేక్షిస్తారు.

36వ సీఎండీ శ్రీధర్

సింగరేణి సంస్థ అడ్మినిస్ట్రేషన్ అధికారి, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లను 1921నుంచి నియమిస్తోంది. తొలుత అడ్మినిస్ట్రేషన్ అధికారిగా చైర్ పర్సన్ ఉండేవారు. 1972 వరకు చైర్‌పర్సన్ వ్యవస్థ కొనసాగగా, 1972లో తొలిసారి సీఎండీగా కే.ఐ.విద్యాసాగర్ నియమితులయ్యారు. ఇదేక్రమంలో 2015లో సీఎండీగా నియమితులైన ఎన్.శ్రీధర్ ఇప్పటివరకు కొనసాగుతున్నారు.



ఇల్లెందులో ఏర్పాటుచేసిన బొగ్గు అన్వేషకుడు విలియం కింగ్ విగ్రహం

నేడు కొత్తగూడెంలో వేడుకలు

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శనివారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9.50గంటలకు పతాకావిష్కరణ ఉండగా, పలు కార్యక్రమాలు జరుగుతాయి. ఇక సాయంత్రం ఏరియాల వారీగా ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసిన అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఈ వేడుకలకు సింగరేణి డైరెక్టర్లు ఎన్.బలరామ్, సత్యనారాయణరావు, ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు పూర్తిచేయగా, విభాగాల వారీగా ప్రత్యేకతలను వివరించేలా స్టాళ్లు ఏర్పాటుచేశారు.

క్లుప్తంగా

సింగరేణి కార్మికులకు మాస్క్ తప్పనిసరి

సింగరేణి(కొత్తగూడెం): కరోనా కొత్త వేరియంట్‌తో అక్కడక్కడా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో సింగరేణి కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సూచించారు. విధులకు వెళ్లే సమయాన తప్పక మాస్క్ ధరించాలని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, చేతులను తరచూ శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని, భౌతిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

అండర్-16 తెలంగాణ జట్టులో భద్రాద్రి యువకుడు


రామ్‌పార్థవ నాయుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన యువకుడికి అండర్-16 తెలంగాణ జట్టులో చోటు దక్కింది. పట్టణానికి చెందిన కె.రామ్‌పార్థవనాయుడు గుజరాత్‌లో బీసీసీఐ నిర్వహిస్తున్న టోర్నీలో పాల్గొనే అండర్-16 తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడు. రామ్‌పార్థవనాయుడు 7వ తరగతి వరకు భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో చదివి, క్రికెట్‌పై మక్కువతో హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారం బ్రాంచ్‌లో చేరాడు. 2022-23లో హెచ్‌సీఏ స్కూల్ లీగ్ మ్యాచ్‌లో 183 పరుగులు సాధించాడు. ఢిల్లీలో ఎంఎస్ ధోని అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ క్రికెట్ టోర్నీలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. దీంతో హెచ్‌సీఏ తెలంగాణ అండర్-16 జట్టుకు ఎంపిక చేసింది. కాగా, పట్టణానికి చెందిన పలువురు క్రికెట్ క్రీడాకారులు, ప్రముఖులు రామ్‌పార్థవనాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

టీబీ పరీక్ష పరికరాలు తరలించొద్దు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని అదనపు జిల్లా క్షయ వ్యాధి నిర్మూలనా కేంద్రంలోని వ్యాధి నిర్ధారణ పరికరాలను తరలించవద్దని శుక్రవారం రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీషలకు వినతి పత్రాలు అందించినట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. పీఓ, డీఎంహెచ్‌ఓ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అనంతరం పీఓను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వై. సూర్యనారాయణ, టి. రాజారెడ్డి, వి. కామేశ్వరరావు, బి. వెంకటరెడ్డి, డాక్టర్. భాను ప్రసాద్, రవి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రం దగ్ధం


దగ్ధమైన వరికోత యంత్రం

ఇల్లెందురూరల్: మండలంలోని సుంకరగూడెం గ్రామంలో శుక్రవారం వరికోత యంత్రం ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. అద్దె పద్ధతిలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వారం రోజులుగా సుంకరగూడెం పరిసర ప్రాంతాల్లో వరికోతలు చేపడుతున్నారు. గురువారం రాత్రి వరకు వరికోత పనులు సాఫీగా కొనసాగాయి. శుక్రవారం పనులకు బయలు దేరుతున్న క్రమంలో యంత్రం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడున్న వారంతా పరుగులు తీశారు. ఏం జరుగుతుందోనని గుర్తించేలోపే యంత్రం పూర్తిగా దగ్ధమైంది. వరిచేలకు దూరంగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో పెనుప్రమాదం తప్పినట్లైందని రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మండలంలోని నారాయణపురం, నెమలిపేటతోపాటు పలు ప్రాంతాల్లోని వాగుల నుంచి కొందరు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ అశ్వారావుపేట సమీపంలోని రైస్ మిల్లు వద్ద పట్టుకున్నారు. మొత్తం 14 ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై డీటీ సుచిత్ర మాట్లాడుతూ.. పట్టుబడిన ట్రాక్టర్లకు ఎలాంటి అనుమతులు లేవని, ట్రాక్టర్లను సీజ్ చేశామని తెలిపారు.


రూ.3 లక్షలు విలువ చేసే గొర్రెలు చోరీ

పాల్వంచ: కొట్టంలో ఉంచిన రూ.3 లక్షల విలువ చేసే గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన గురువారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కోడిపుంజుల వాగు గ్రామానికి చెందిన హలావత్ సక్రు తన గొర్రెలను గురువారం రాత్రి కొట్టంలో ఉంచాడు. చలికాలం కావడంతో వారు ఇంట్లో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున చూసే సరికి అందులో 30 గొర్రెలు మాయం అయినట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలను కొంత దూరం తోలుకెళ్లి వాహనంలో ఎక్కించుకుని వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. చోరీకి గురైన గొర్రెల విలువ రూ.3 లక్షలు ఉంటుందని అంచనా. ఏఎస్ఐ సుధాకర్‌ను వివరణ కోరగా గొర్రెలు చోరీ అయినట్లు ఫిర్యాదు అందగా పరిశీలిస్తున్నామని, సీసీ ఫుటేజీలు చూస్తున్నామని చెప్పారు.

భయం వద్దు... జాగ్రత్తలు పాటిస్తే చాలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వెయ్యి పడకలు రెడీ

- కోవిడ్ వార్డు, ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ కిట్లు సిద్ధం
- అందరు మాస్క్‌లు వాడాలి.. భౌతిక దూరం పాటించాలి
- జ్వరం, దగ్గు వస్తే సర్కారు ఆస్పత్రులకు వెళ్లాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి


జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడ కుమారస్వామి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో కరోనా కేసు ఒకటి కూడా నమోదు కాలేదని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.కుమార స్వామి తెలిపారు. అయితే పక్క జిల్లాలో ఒక కేసు నమోదైందని, రాష్ట్రంలో కూడా కేసులు నమోదైన నేపథ్యంలో ప్రతీ ఒక్కరు మాస్క్‌లు వాడాలని సూచించారు. క్రిస్మస్, నూ ఇయ్యర్ పండుగల నేపథ్యంలో రద్దీ పెరిగే అవకాశం ఉందని, జన సంచారస్థలాలు, కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో భౌతిక దూరం పాటించాలని వివరించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1000 పడకలు, జిల్లా ఆస్పత్రిలో 50 పడకలతో కరోనా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలు చేసేందుకు ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ కిట్లు ఉన్నాయని, వెంటిలేటర్లు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, జ్వరం దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలన్నారు. ప్రస్తుతం కరోనా జేఎన్-1 వేరియంట్ కేసులు వస్తున్న నేపథ్యంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన ప్రజల సందేహాలను నివృత్తి చేశారు.

ప్రశ్న: మళ్లీ కరోనా వస్తే ప్రాణహాని జరుగుతుందా?
–రేవతి, సుజాతనగర్

జవాబు : ప్రాణహాని ఉండదు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. చికిత్స పొందితే తగ్గిపోతుంది.

ప్రశ్న: రెమిడిసివర్ ఇంజక్షన్, రెండుసార్లు వ్యాక్సినేషన్ వేసుకున్న వారికి గుండె పోటు వస్తుంది. ఎందుకు సార్?
–కందుల నవీన్

జవాబు : కరోనా వ్యాక్సిన్, రెమిడిసివర్ వేసుకున్న వారికి గుండె పోటు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయనేది అపోహమాత్రమే. అందులో నిజం లేదు.

ప్రశ్న: చిన్న పిల్లలకు కరోనా వస్తే ఏమి చేయాలి
– పల్లపు వెంకటేశ్వర్లు, కొత్తగూడెం

జవాబు : చిన్న పిల్లలకు స్కూల్‌కు వెళ్లితే మాస్క్ తప్పనిసరిగా వాడాలి. పిల్లలను ఆటలు ఆడుకునేందుకు ప్రోత్సహించకూడదు. జ్వరం, జలుబు, వచ్చినా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలి. పారసిటామల్, అజిత్రోమైసిన్ మాత్రలు వైద్యుల సలహాతో వాడాలి.

ప్రశ్న: రెమిడిసివర్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయా?
–కోదాడ శ్రీనివాస్, కొత్తగూడెం

జవాబు : ఇంజక్షన్లు ప్రస్తుతం అందుబాటులో లేవు. రెమిడిసివర్ కూడా లేదు. ప్రభుత్వం పంపిస్తుంది. తీవ్రతను బట్టి జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉన్న యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వాడితే సరిపోతుంది.

ప్రశ్న: కరోనా ఎదుర్కొనేందుకు ఏమి సౌకర్యాలు కల్పించారు?
–ఎండీ యాకూబ్‌పాషా, పాల్వంచ

జవాబు : జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పడకలు, ఐసోలేషన్ వార్డు సిద్ధంచేశాం. వెంటిలేటర్లు 24 ఉండగా, 24 గంటలూ వైద్య సేవలందిస్తాం. కేసులు పెరిగితే జనరల్ 280 పడకలు కరోనాకు కేటాయిస్తాం.

ప్రశ్న: దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి కరోనా వస్తే పరిస్థితి ఏమిటీ?
– రాయల శాంతయ్య , విద్యానగర్

జవాబు : షుగర్, బీపీ, పక్షవాతం, కిడ్నీ సమస్య, గుండె స్టంట్ వేసుకున్న వారికి కరోనా వచ్చినా భయం అవసరం లేదు. ఈ కరోనా వేరియంట్ తీవ్రత ఎక్కువగా లేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.

ప్రశ్న: గర్భిణులకు కరోనా వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి.
–శైలజ, భద్రాచలం

జవాబు : గర్భిణులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి నెలా వైద్య పరీక్షలకు వచ్చినా సమయంలో కరోనా పరీక్షలు చేయించుకుని, డాక్టర్ సూచనల మేరకు మందులు వాడాలి.

ప్రశ్న: కరోనా నివారణకు మళ్లీ వ్యాక్సినేషన్ చేస్తారా? హోమ్ ఐసోలేషన్ ఉండాలా?
–ఎం.రమ్య

జవాబు : ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. వాక్సినేషన్ విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉంటుంది. కరోనా వస్తే వైద్యులు అడ్మిట్ చేసి వైద్య సేవలు అందిస్తారు. హోమ్ ఐసోలేషన్ అవసరమయితే డాక్టర్ సలహా మేరకు ఉండాలి

పోలీసుల తీరుతో భక్తులకు ఇక్కట్లు

- భద్రాద్రిలో పునరావృతమైన సమస్య
- తెప్పోత్సవం చూడకుండానే వెనుతిరిగిన వృద్ధులు, మహిళలు


బిడ్జి సెంటర్‌లో ట్రాఫిక్ జామ్

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన తెప్పోత్సవ కార్యక్రమాన్ని చూడకుండానే పలువురు భక్తులు వెనుతిరిగారు. బందోబస్తు పేరిట పోలీసులు భక్తుల వాహనాలను ఆపి వెనుక్కిపంపడంతో శ్రీసీతారాముల జలవిహారాన్ని చూడలేకపోయారు. దీంతో ఏటా మాదిరిగానే సమస్య పునరావృతమైనట్లయింది. పోలీసులు ముంగానే తెప్పోత్సవం నిర్వహించే గోదావరి పుష్కరఘాట్‌కు వెళ్లే దారులను బారికేట్లతో మూశారు. ఆలయ సమీపాన పార్కింగ్ స్థలం వరకు కూడా భక్తుల వాహనాలను అనుమతించలేదు. దీంతో వృద్ధులు, మహిళలు సుమారు మైలు దూరంలో జరు గుతున్న తెప్పోత్సవం తిలకించేందుకు వెళ్లలేకపోయారు. కాగా, ఈ ఏడాది వీవీఐపీలు ఎవరూ రాకపోయినా పోలీసులు మాత్రం వారి బంధువుల సేవలో తరించారనే విమర్శలు వినిపించాయి. ఉన్నతాధికారుల వాహనాలను గోదావరి తీరం వరకు అనుమతించిన పోలీసులు భక్తుల వాహనాలను పార్కింగ్ స్థలాల వరకు అనుమతించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరలో పోలీసులు అందరూ తెప్పోత్సవ కార్యక్రమానికి వెళ్లగా భక్తుల తిరుగు ప్రయాణంలో పట్టణంలో కాసేపు ట్రాఫిక్ జామ్ అయింది.

ఉద్యోగుల సంక్షేమం కోసమే ఐఎన్‌టీయూసీలోకి..


రజాక్‌కు కండువా కప్పుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): అధికారంలో ఏపార్టీ ఉంటుందో, ఆ పార్టీ అనుబంధ సంఘం గుర్తింపు సంఘంగా గెలిస్తేనే కార్మికుల హక్కుల సాధన సాధ్యమవుతుందని కొత్తగూడెం ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ దూరంగా ఉంటుందని అధినాయకులు ప్రకటించగా, తాము శుక్రవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్‌లో చేరామని వెల్లడించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన అనంతరం రజాక్ మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ గెలుపునకు కృషి చేయాలి

ఐఎన్‌టీయూసీ కండువా కప్పుకున్న వారంతా గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వివిధ యూనియన్ల నుంచి శుక్రవారం ఐఎన్‌టీయూసీలో చేరిన వారికి కండువాలు కప్పిన అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణిలో పూర్వవైభవం రాబోతోందన్నారు. నాయకులు ఆళ్ల మురళి, ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్‌నాయక్, కార్తీక్, అంతోటి నాగేశ్వరరావు, చెన్నకేశవరావు, గోపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

గాయాలతో తప్పించుకున్న మావోయిస్టులు?

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు గాయపడి తప్పించుకుపోయినట్లు తెలుస్తోంది. బీజాపూర్ జిల్లాలోని జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధి పోతేనార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు బైరంఘడ్ ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో శుక్రవారం ఉదయం నుంచి డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోతేనార్ అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరపడంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులకు గాయాలవ్వగా వారు తప్పించుకుపోయినట్లు అక్కడి పోలీసుల ద్వారా సమాచారం అందింది. ఇదే క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి ఒక జవానుకు తీవ్ర గాయాలవ్వగా అతడిని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు తప్పించుకున్న ప్రాంతానికి అదనపు బలగాలను తరలించి కూంబింగ్‌ను ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ ఆంజనేయ వర్షెనే తెలిపారు.

మందు పాతర నిర్వీర్యం

చర్ల: ప్రైవేట్ బస్సుకు నిప్పంటించిన మావోయిస్టులు ఆ ప్రాంతానికి వచ్చే పోలీస్ బలగాలే లక్ష్యంగా ఏర్పాటు చేసిన దాదాపు 5 కిలోల సామర్థ్యం గల మందు పాతరను పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. బిహార్, జార్ఖండ్‌లలో విప్లవోద్యమాన్ని ప్రభుత్వ బలగాలు అణిచివేస్తున్నాయని నిరసిస్తూ శుక్రవారం భారత్‌బంద్ పాటించాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఏపీ సరిహద్దుల్లో మూడు రోజులుగా విధ్వంసాలకు దిగిన మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపూర్ సమీపంలో ఓ బస్సుకు నిప్పంటిచారు. బస్సు దగ్ధమవుతున్న సందర్భంలో అక్కడికి వచ్చే పోలీస్ బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో అక్కడికి సుమారు 20 మీటర్ల దూరంలో ప్రధాన రహదారిపై మావోయిస్టులు సుమారు 5 కిలోల సామర్థ్యం గల మందు పాతర ఏర్పాటు చేశారు. అయితే, అక్కడికి వచ్చిన సీఆర్‌పీఎఫ్ 168 బెటాలియన్‌కు చెందిన పోలీసు బలగాలు దానిని గుర్తించి నిర్వీర్యం చేశాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఏజెన్సీలో కనిపించని బంద్ ప్రభావం

చర్ల: బిహార్, జార్ఖండ్‌లలో విప్లవోద్యమాన్ని ప్రభుత్వ బలగాలు అణచివేస్తున్నాయని ఆరోపిస్తూ మావోయిస్టు పార్టీ ఇచ్చిన భారత్‌బంద్ పిలుపుపై ఏజెన్సీలో ఏవిధమైన ప్రభావం కనిపించలేదు. ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలన్నీ యథాతథంగా తిరిగాయి. హోటళ్లు, సినిమా హాళ్లు, పెట్రోల్ బంక్‌లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, వైన్‌షాపులతోపాటు ఇతర కార్యాలయాలన్నీ తెరుచుకునే ఉన్నాయి. ముందస్తుగా అటవీ ప్రాంత గ్రామాలకు పోలీసులు వాహనాల రాకపోకలను నిషేధించారు. బంద్ సందర్భంగా ఎలాంటి విధ్వంసాలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ చేపట్టడంతోపాటు తనిఖీలను కొనసాగించారు. బంద్ ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులు ఇటు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కిష్టారం – చింతల్నార్ రహదారి దిగ్బంధం


రహదారిపై చెట్ల కొమ్మలు వేసిన దృశ్యం

చర్ల: భారత్‌బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలోని కిష్టారం – చింతల్నార్ మార్గంలో రహదారిని దిగ్బంధం చేశారు. ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున చెట్ల కొమ్మలు వేసి కరపత్రాలు అంటించారు. బిహార్, జార్ఖండ్‌లలో విప్లవోద్యమంపై ప్రభుత్వ బలగాల అనిచివేతకు నిరసనగా డిసెంబర్ 22న బంద్ పాటించాలని కరపత్రాలు, వాల్‌పోస్టర్లలో మావోయిస్టులు కోరారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

హత్య కేసులో జీవితఖైదు..

కొత్తగూడెంటౌన్: తల్లిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవితఖైదు విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. భద్రాచలానికి చెందిన యర్రంశెట్టి పార్వతమ్మకు కుమారులు వెంకటరత్నం, యర్రంశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. పెద్దకుమారుడు వెంకటరత్నం 2020 డిసెంబర్ 26వ తేదీన వ్యాపార నిమిత్తం దుకాణానికి వెళ్లేటపుడు తన తల్లిని పలకరించాలని ఆమె ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో ఆమె మంచం కింద పడి చనిపోయి ఉంది. ఎవరిపైనా అనుమానం లేదని అప్పటి భద్రాచలంటౌన్ పోలీస్ స్టేషన్‌లో వెంకటరత్నం ఫిర్యాదు చేశారు. అయితే, తన తల్లి పార్వతమ్మ చిన్నకుమారుడికి ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చిందని, ఇది మనసులో పెట్టుకుని తన తమ్ముడు శ్రీనివాస్ కక్ష పెంచుకుని, తల్లిని హత్య చేసి, బంగారు ఆభరణాలు, ప్రామిసరీ నోట్ ఎత్తుకెళ్లినట్లు పోలీస్ విచారణలో వెంకటరత్నం చెప్పాడు. దీనిపై ఇన్‌స్పెక్టర్ టి.స్వామి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 19 మంది సాక్షులను విచారించగా యర్రంశెట్టి శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను పీపీ పోసాని రాధాకృష్ణశర్మ నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ ఎన్.వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్‌బాబు సహకరించారు.

గాయపడిన యువకుడు మృతి


రాజు (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహాదేవపురం గ్రామానికి చెందిన సొందె రాజు (22) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భద్రాచలంలో డిగ్రీ పరీక్షలకు వెళ్లి మిత్రులతో కలిసి వస్తూ తూరుబాక గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. కాగా, వారిలో తీవ్రంగా గాయపడిన సొందె రాజును ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్చి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. యువకుడి మృతితో మహాదేవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బతుకుదెరువుకు వెళ్లి విగతజీవిగా..

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో పాల్వంచ యువకుడు మృతి


శ్రీకాంత్ (ఫైల్)

పాల్వంచ: బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గాజులగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భట్టు సద్దన్ రెండో కుమారుడు శ్రీకాంత్ (28) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఓ ప్రముఖ కంపెనీలో ఫుడ్ డోర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మియాపూర్ వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న కూడా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. శ్రీకాంత్ మృతదేహాన్ని శనివారం గాజులగూడెంనకు తీసుకురానున్నారు. యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కేటీసీలో కాపర్ వైర్ చోరీ

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో కాపర్ వైరు చోరీకి గురవగా బోడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం.. గురువారం రాత్రి కేసీలో సుమారు 35 మీటర్ల కాపర్‌వైరును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. కాపర్ వైరు విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. సింగరేణి ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

దారి పొడవునా ధాన్యమే..


మొక్కజొన్నలు నింపి ఉన్న బస్తాలు

గుండాల: పంట చేలల్లో ఎండబెట్టాల్సిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. రైతులకు అవగాహన లేక ఇలా చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి సమయంలో కొందరు వాహనదారులు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. గుండాల – ఇల్లెందు, గుండాల – పస్రా వెళ్లే ప్రధాన రహదారులపై మొక్కజొన్న, వరి ధాన్యం ఆరబోస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న పంట ఉత్పత్తులను ఇలా రోడ్లపై రోజుల తరబడి ఆరబోస్తున్నారు. ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే, రాత్రి పూట వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. బస్తాలు సైతం రోడ్లపైనే నింపి పెడుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్నలు